# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 11 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల బుధవారం 16 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 11 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA WED 16 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు..

### గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

- 2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

- మిగతా 2లో



## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

- గుండెపోటుతో ఆళ్ల నాని మృతి
- 1969లో ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని
- గత ఏడాది వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాని



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

### మాజీ మంత్రి ఆళ్ల నాని మృతిపై సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో దూరమవ్వడం బాధాకరం అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

- మిగతా 2లో



## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్.. పలు కార్యక్రమాలకు శ్రీకారం

- నెల్లూరు నగరంలో ఆధునీకరించిన రెండు ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవం
- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న లోకేశ్
- కోవూరు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం

- మిగతా 2లో



## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- తిరుమలలో బ్రహ్మోత్సవాల శోభ
- ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు
- కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

- మిగతా 2లో

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు.. ఈనెల 22న ఓటర్ల జాబితా

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం
- 41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు
- ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం
- 2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ
- ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

- మిగతా 2లో




## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం



- ప్రభుత్వంపై బురద జల్లేందుకు అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని కోచింగ్ సెంటర్లపై ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ నిర్ధారణ
- జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి
- రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ

- మిగతా 2లో



## అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

- నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై కేసు
- నానక్‌రామ్‌గూడ భూ వివాదంపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు
- గేట్ల తాళాలు పగలగొట్టి చొరబడ్డారని ఆరోపణ
- సీసీటీవీ ఫుటేజీను పోలీసులకు సాక్ష్యంగా అందజేత
- ఉద్యోగులు, నివాసితులకు రక్షణ కల్పించాలని వినతి

- మిగతా 2లో

## మీ ఫోన్ నుంచి రూ.10 వేలు పంపితే.. 40 రూపాయలు ఛార్జీ పడుతుందా..?

- యూపీఐ పేమెంట్లపై కొత్త ఛార్జీలు.. సామాన్యుడిపై భారం ఎంత?
- పెంచిన ఛార్జీలు మర్చంట్లు చెల్లిస్తారంటున్న కేంద్ర ప్రభుత్వం
- పేమెంట్ సంస్థలు, బ్యాంకుల విధానాలపై ఆధారపడి కస్టమర్ పై కొత్త ఛార్జీలు
- కొత్త ఛార్జీలతో నేరుగా కస్టమర్ పై భారం పడుతుందని ప్రతిపక్షాల ఆందోళన

- మిగతా 2లో



## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

### జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్

- దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్
- యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి
- ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య
- తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి

- మిగతా 2లో





## 58 యుద్ధాల ప్రభావం 850 కోట్ల మందిపై పడింది: కేఏ పాల్

- నిత్యావసర వస్తువులు, ఇంధన ధరల పెరుగుదలపై పాల్ ఆవేదన
- ఇరాన్ యుద్ధం వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్య
- ప్రపంచ శాంతి కోసం టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడి

- మిగతా 2లో

## మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి

### బిల్ గేట్స్ అనూహ్య వ్యాఖ్యలు

- ఏఐ వృద్ధి నియంత్రణ అవసరమని పిలుపునిచ్చిన బిల్ గేట్స్
- ఇంతటి భారీ మార్పుకు మనం సిద్ధంగా లేమని వ్యాఖ్య
- సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని హెచ్చరిక
- ఏఐపై ఆందోళన వ్యక్తం చేసిన ఎలాన్ మస్క్, శామ్ ఆల్ట్‌మన్

- మిగతా 2లో




## మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు

- నిజామాబాద్ సీపీ ముందు లొంగిపోయిన నక్కా సుశీల
- తెలంగాణలో మావోయిస్టులు పూర్తిగా దెబ్బతిన్నారన్న పోలీసు అధికారులు
- మరో ముగ్గురు తెలంగాణ నేతలే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా /జ్యోతి) లొంగిపోయారు.

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## జనం వస్తున్నారని సంబరపడాలా? మారలేదని బాధపడలా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు జనం పోటెత్తుతున్నారు. పరామర్శకు వెళ్లినా జనం విపరీతంగా రావడం సహజంగా పార్టీ క్యాడర్ లో జోష్ మరింత పెరగాలి. కానీ భయం మాత్రం వైసీపీ నేతలను, ద్వితీయ శ్రేణి నేతలను మాత్రం వెంటాడుతుంది. వైఎస్ జగన్ గతం కంటే భిన్నంగా లేరు. గతంలో ఎలా ఉన్నారో.. దారుణ ఓటమిని చవి చూసిన తర్వాత కూడా జగన్ తన తీరును మార్చుకోలేదు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన లోటు పాట్లను జగన్ సరిదిద్దుకునే ప్రయత్నం చేయడం లేదు. సహజంగా ఏ ప్రాంతీయ పార్టీ అధినేత అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా, కోల్పోయిన తర్వాత మరొకలా ఉంటారు. కానీ జగన్ ధోరణి మాత్రం అప్పటికీ, ఇప్పటికీ భిన్నంగా లేదని పార్టీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వంపై అసంతృప్తిని...

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతుంది. ప్రభుత్వంపై కొంత వరకూ అసంతృప్తి ఏర్పడిందన్న భావనలో వైసీపీ నేతలు ఉన్నారు. జగన్ అందించిన సంక్షేమ పథకాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి పోలిక పెట్టి చూసుకుని మరీ జగన్ పాలన మెరుగు అని అంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రత్యర్థి పార్టీ నేతలు కూడా అదే పరిస్థితుల్లో ఉన్నాయి. తాము జనం వద్దకు వెళ్లినప్పుడు పథకాల గురించి నిలదీస్తుండటంతో ప్రభుత్వంపై అసంతృప్తి మొదలయిందని కూటమి ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. కానీ దానిని సక్రమంగా వైసీపీ తమకు అనుకూలంగా క్యాష్ చేసుకోలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. దీంతో పాటు వరసగా ఇస్తున్న కార్యక్రమాలు కూడా వైసీపీ నేతలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దీనివల్ల ఆర్థిక భారం మాత్రమే కాకుండా కేసులు నమోదవుతున్నాయంటున్నారు.

పేద, మధ్య తరగతి ప్రజలకు...

ఉదాహరణకు మెగా డీఎస్సీలో అవకతవకలపై ఆందోళనలు చేస్తే సామాన్య యూత్ ను కలుపుకుని పోవాల్సిన వైసీపీ నేతలు తమ కార్యకర్తలకే పరిమితమయ్యారు. దీనివల్ల పార్టీకి అంత హైప్ రావడం లేదు. ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలు ధరల మోత, గిట్టుబాటు ధరలు పంటలకు లభించకపోవడం వంటివి చేస్తే జనం నుంచి మద్దతు ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం సీనియర్ నేతలలో వ్యక్తమవుతుంది. ఈ విషయాన్ని జగన్ కు చెప్పినా నిష్ప్రయోజనమే. ఆయన అజెండా ఆయనకుంది. జగన్ తన అజెండా ప్రకారమే వెళ్లాలనుకుంటారు. తాము చెప్పినా తలూపి ఊ కొడతారు తప్పించి తాము చెప్పిన మాటలను చెవికెక్కించుకోలేరని నేతలు అంటున్నారు. కూటమి కలసి ఉన్నప్పుడు ఓడించడం అంత సులువు కాదని గుర్తించి జగన్ ఇప్పటికైనా తన ధోరణిని మార్చుకోవాలని హితవు పలుకుతున్నారు.

## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది.మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు.సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు.ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు..

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

- మొదటి పేజి తరువాయి

ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు.

ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఇంటర్మీడియట్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పూర్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025 ఏప్రిల్ లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## మాజీ మంత్రి ఆళ్ల నాని మృతిపై సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ఆళ్ల నాని గారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

ఆళ్లనాని ఆకస్మిక మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

ఏపీ మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మృతి తనను కలచివేసిందన్నారు. మాజీ మంత్రి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాల్సిందిగా దేవుడ్ని ప్రార్థించారు. వైసీపీ హయాంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్లనాని చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు.

**వివాదాలకు దూరంగా ఉండే మంచి నేత: నారా లోకేష్**

టీడీపీ నేత, మాజీ మంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో మృతి చెందారని తెలియడంతో మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే ఆళ్ల నానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

**ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలి: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) హఠాన్మరణం తనను ఎంతో బాధించిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. 3 సార్లు ఏలూరు శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలు అందించిన వ్యక్తి ఆళ్ల నాని. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన పవన్ కళ్యాణ్.. ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది.నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో

పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు.ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎ×డీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు.

ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు.ప్రస్తుతం తెలంగాణకు చెందిన బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## మీ ఫోన్ నుంచి రూ.10 వేలు పంపితే.. 40 రూపాయలు ఛార్జీ పడుతుందా..?

యూపీఐ పేమెంట్లపై కొత్త ఛార్జీలను ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. రూ.2వేలకు పైబడి చెల్లింపులపై 100కి 40 పైసలు వసూలు చేయనున్నారు. ఈ ఛార్జీలను మర్చంట్ల నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. కస్టమర్ నుంచి వసూలు చేయాలా వద్దా అన్నది సంబంధిత చెల్లింపుల సంస్థలు, బ్యాంకుల విధానాలపై ఆధారపడి ఉంటుంది కాబట్టి యూపీఐ పేమెంట్లపై కొత్త ఛార్జీల భారం నేరుగా ప్రజలపై పడే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

మంగళవారం సెప్టెంబర్ 15న సమావేశమైన యూపీఐ స్టీరింగ్ కమిటీ.. రూ. 2వేలకు పైబడిన లావాదేవీలకు యూపీఐ ఎండీఆర్‌ను 40 బీపీఎస్‌గా నిర్ణయించిన క్రమంలో యూపీఐ యాప్‌ల ద్వారా పెద్ద మొత్తాల్లో చెల్లింపులు చేసే ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ఈ ఎండీఆర్ సాధారణంగా మర్చంట్ నుంచి వసూలు చేసే కమీషన్ కాగా, కస్టమర్ నుంచి నేరుగా వసూలు చేయాలా లేదా అన్నది సంబంధిత చెల్లింపు సంస్థలు, బ్యాంకుల విధానాలపై ఆధారపడి ఉంటుంది.40 బీపీఎస్ అంటే ప్రతి రూ.100కి 40 పైసలు. ఉదాహరణకు రూ.2వేల500 చెల్లింపుపై ఎండీఆర్ రూ.10, రూ.5వేలపై రూ.20, రూ.10వేలపైన రూ.40, రూ.25వేలపై రూ.100 అవుతుంది. ఒకవేళ ఈ ఛార్జీని పూర్తిగా వినియోగదారుడిపైనే బదిలీ చేస్తే, పెద్ద మొత్తాల డిజిటల్ చెల్లింపులు చేసే వారికి ఖర్చు పెరుగుతుంది. ఇదిలా ఉంటే.. రూ.2వేల వరకు యూపీఐ చెల్లింపులకు ఎలాంటి ఛార్జీ ఉండదని ప్రభుత్వం చెబుతోంది. దీంతో రోజువారీ చిన్న మొత్తాల చెల్లింపులు చేసే ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం తక్కువగానే ఉంటుందని అంటోంది. కానీ రూ.2వేలకు పైబడిన షాపింగ్, బిల్లులు, ఫీజులు, సేవల చెల్లింపుల సమయంలో అదనపు ఛార్జీ విధిస్తే వినియోగదారులపై పెద్ద ఎత్తున భారం పెరిగే అవకాశం ఎక్కువగానే ఉంది.ప్రస్తుతం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌లు బ్యాంకులతో కలిసి సేవలు అందిస్తున్నాయి. సుమారు 40 బేసిస్ పాయింట్ల ఎండీఆర్‌తో ఈ వ్యవస్థకు ఏటా రూ. 16వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయం ఎన్‌పీసీఐ, బ్యాంకులు, పీఎస్‌పీలు, పేమెంట్ అగ్రిగేటర్లకు పంపిణీ అవుతుంది. ఈ క్రమంలో 40 బీపీఎస్ ఎండీఆర్‌ను వ్యాపారులు భరిస్తారా? లేక చివరికి వినియోగదారులపై ఛార్జీ రూపంలో పడుతుందా? అనేది యూపీఐ వినియోగదారులపై ప్రభావాన్ని నిర్ణయించనుంది.

## 58 యుద్ధాల ప్రభావం 850 కోట్ల మందిపై పడింది: కేఏ పాల్

ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాల కారణంగా నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రపంచంలో జరిగిన వివిధ 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాలలోని 850 కోట్ల మంది ప్రజలపై తీవ్రంగా పడిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి ప్రారంభమై ఆరు నెలలుగా కొనసాగుతున్న అమెరికా – ఇరాన్ సైనిక ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిని, సామాన్యుడికి నిత్యావసరాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు.మార్కెట్లో రూ. 100 ఉండే వస్తువుల ధరలు రూ. 200 నుండి రూ. 300 వరకు పెరిగాయని, లీటర్ పెట్రోల్, గ్యాస్ ధరలు 2 డాలర్ల నుండి ఏకంగా 4 నుండి 5 డాలర్లకు పైగా భారమయ్యాయని లెక్కలతో వివరించారు. ధనిక వర్గాలకు దీనివల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ, సమాజంలో ఉన్న 90 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ద్రవ్యోల్బణంతో అల్లాడిపోతున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొంటేనే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేసిన కేఏ పాల్, గ్లోబల్ పీస్ సాధన కోసం రాబోయే సెప్టెంబర్ 28న వాషింగ్టన్ డీసీలోని టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రత్యేక ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి

సమానత్వం కోసం ఏఐపై 1 బిలియన్ డాలర్లు కేటాయించిన గేట్స్ ఫౌండేషన్‌టెక్నాలజీ రంగంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏఐ' పురోగతి వేగాన్ని కొంతమేర తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ సాంకేతికత తీసుకురాబోయే భారీ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచం ఇంకా సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక అంశాలను పంచుకున్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గతంలోని పర్సనల్ కంప్యూటర్లు లేదా ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణల కంటే భిన్నమైనదని, ఇది సమాజంలో లోతైన మార్పులకు కారణమవుతుందని బిల్ గేట్స్ వివరించారు. "ఇంత వేగవంతమైన, విస్తృతమైన మార్పులకు మనం ఇంకా సంసిద్ధం కాలేదు. నిరంతరం ఆవిష్కరణలను ప్రోత్సహించే నేనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యంగా అనిపించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత సైబర్ దాడుల రూపంలో పెను ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మోడల్స్ నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు వచ్చిన 'హగ్గింగ్ ఫేస్ ఘటన'ను ఆయన ప్రస్తావించారు.ఇటీవల టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ఏఐ అభివృద్ధి వేగం పట్ల ఇటువంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్ గేట్స్ కూడా వారి వాదనతో ఏకీభవించడం ప్రాధాన్యత సంతరించుకుంది.మరోవైపు, ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ విశ్వసిస్తోంది. తమ 'గోల్‌కీపర్స్ రిపోర్ట్'లో పేర్కొన్నట్లుగా, ఏఐని సరైన మార్గంలో నడిపిస్తే, అది సామాజిక సమానత్వాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుందని వెల్లడించింది. ఈ దిశగా, సమానత్వంతో కూడిన ఏఐ అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ 1 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు స్పష్టం చేసింది.

## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్.. పలు కార్యక్రమాలకు శ్రీకారం

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు (సెప్టెంబర్ 16) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజు రెండు నియోజకవర్గాల్లో ఆయన పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ వివరాలు విడుదలయ్యాయి.

పర్యటనలో భాగంగా తొలుత ఉదయం నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు స్టోన్ హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణ పనులను, 11:10 గంటలకు మూలపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించే అవకాశం ఉంది.

మధ్యాహ్నం కోవూరు నియోజకవర్గంలో పర్యటన కొనసాగుతుంది. 12:15 గంటలకు కోవూరు పట్టణంలోని నెల్లూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెన్నై-విజయవాడ హైవే వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కోవూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో జరిగే సమన్వయ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. ఈ పర్యటనకు సంబంధించి స్థానిక టీడీపీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు.. ఈనెల 22న ఓటర్ల జాబితా

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు.

2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా (ఉఖ్రిశ్రీఅఖఎఖఅస్త్ర ఙఘ్వ) ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది.ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.



# విజయవాడ బస్టాండ్‌లో పేలుడు పదార్థాలు స్వాధీనం



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 15:** విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో భారీగా పేలుడు పదార్థాలు లభించడం కలకలం రేపింది. కృష్ణలంక పోలీసులు బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఓ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా అందులో 46 జిలెటిన్ స్టిక్స్, 50 డిటోనేటర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి మొత్తం బరువు సుమారు ఐదు కిలోలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.ప్రయాణికుల సమాచారంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ ప్రయాణికుడు బ్యాగ్‌ను బస్టాండ్‌లో వదిలేసి వెళ్లినట్లు ప్రాథమికంగా సమాచారం అందింది. ఘటనపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బ్యాగ్‌ను ఎవరు తీసుకొచ్చారు? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎందుకు బస్టాండ్‌లో వదిలి వెళ్లారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# దీర్ఘకాలంగా పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 15:** ప్రభుత్వ సేవలను ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. రాష్ట్రస్థాయి కలెక్టర్ల సమావేశంలో చర్చించిన అంశాలు, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి సమస్యకు స్పష్టమైన కాలపరిమితి నిర్దేశించుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సామాజికంగా ఎక్కువ ప్రభావం చూపే సమస్యల పరిష్కారానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

జిల్లాలోని ప్రతి శాఖ ప్రధాన పనితీరు సూచికల పురోగతి వివరాలను కంట్రోల్ రూమ్‌కు ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు జిల్లాలో ఉన్నాయని పేర్కొన్న కలెక్టర్.. క్రియాశీలంగా లేని పరిశ్రమలను గుర్తించి, వాటిని తిరిగి కార్యకలాపాల్లోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో ఏడాది పొడవునా పచ్చదనం ఉండేలా మొక్కల పెంపకం, సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.



**ఈ–ఆఫీస్‌కు ప్రాధాన్యత**

పరిపాలనా ప్రక్రియను వేగవంతం, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఫైళ్లు ఈ–ఆఫీస్ ద్వారానే రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫైళ్ల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**పాఠశాలల్లో స్టార్ రేటింగ్ మెరుగుపడాలి**

జిల్లాలోని అన్ని పాఠశాలలు స్టార్ రేటింగ్స్‌లో ముందంజలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**టీనేజ్ గర్భధారణ నివారణకు చర్యలు**



టీనేజ్ గర్భధారణను నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బాలికల ఆరోగ్యం, విద్య, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న బాలికలను ముందుగానే గుర్తించి అవసరమైన కౌన్సెలింగ్, ఆరోగ్య సేవలు, రక్షణ, సహాయం అందించాలని సూచించారు.

**అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు**

జిల్లాలోని అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతను పటిష్టం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లలో మౌలిక వసతులు, పరిశుభ్రత, భోజనం, భద్రత తదితర అంశాలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో ఘనంగా ఒంగోలు జాతి బండలాగుడు

## బల ప్రదర్శన ఎమ్మెల్యే రామాంజనేయులు



**గుంటూరు ,పెన్ పవర్,సెప్టెంబర్ 15:** వినాయక చవితిని పురస్కరించుకుని ప్రత్తిపాడు మండల కేంద్రంలో నందమూరి తారక రామారావు మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శన కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణతో కలిసి ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శనను ఎమ్మెల్యే రామాంజనేయులు, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వినాయక చవితి మరుసటి రోజు ఒంగోలు జాతి బండలాగుడు బల ప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న ఎన్టీఆర్ ఆశయానికి ఈ కార్యక్రమం ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలుస్తూ, రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు.ఒంగోలు జాతి పశువులు అంతరించిపోతున్న తరుణంలో వాటి ప్రాధాన్యతను చాటిచెప్పేలా జాతీయ స్థాయిలో బండలాగుడు బల ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుంతలు లేని రోడ్లే లక్ష్యం నగర కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 15:** గుంటూరు నగరంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. నగరంలోని అన్ని రహదారులపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.మంగళవారం విద్యానగర్, వికాస్‌నగర్, జేకేసీ కళాశాల రోడ్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రోడ్లపై గుంతల మరమ్మతులకు అనుమతులు ఉన్నప్పటికీ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బందిపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా



వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులకు అనుమతులు, ఉత్తర్వులు పొందినప్పటికీ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేసి, పనులను రద్దు చేయాలని ఆదేశించారు.రోడ్లు, డ్రెయిన్ల పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ సామగ్రి ఉంచితే వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఉల్లంఘనలు పునరావృతమైతే నిర్మాణాలకు పనులు నిలిపివేత ఉత్తర్వులు జారీ చేయాలని స్పష్టం చేశారు.నగరంలో ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ తయారీ యూనిట్లను గుర్తించి వెంటనే సీజ్ చేయాలని, దుకాణాల్లో పారిశుధ్య సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వినాయక చవితి మండపాల వద్ద తప్పనిసరిగా చెత్తబుట్టలు ఏర్పాటు చేసి పరిశుభ్రత పాటించేలా మండపాల నిర్వాహకులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ బాబు, ఈఈ విష్ణువర్ధన్, డీఈఈ వెంకటరమణ, ఎస్ఎస్ సోమశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై ఆర్ఓలు, ఏఆర్ఓలకు

## ప్రత్యేక శిక్షణ కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 15:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్ఓలు, ఏఆర్ఓలకు మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల నిర్వహణలో ఆర్ఓల పాత్ర అత్యంత కీలకమని మాస్టర్ ట్రైనర్లు తెలిపారు. విధుల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకున్నా రిటర్నింగ్ అధికారిదే పూర్తి బాధ్యత అని, కాబట్టి ఎన్నికల విధులను అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు.

తమకు కేటాయించిన డివిజన్లలో ఓటర్ల జాబితా, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించాలని సూచించారు. అవసరమైన చర్యల కోసం నగర పాలక సంస్థ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ఆర్ఓలు, ఏఆర్ఓలు రిటర్నింగ్ అధికారి మార్గదర్శిని, ఎన్నికల మార్గదర్శకాలు, అభ్యర్థుల మార్గదర్శిని తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు నగర పాలక సంస్థ నుంచి అవసరమైన అన్ని సదుపాయాలు, సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు సి.హెచ్. శ్రీనివాస్, బి. శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, ఆర్ఓలు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

# కానూరులో రూ.80 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**పెన్ పవర్, కృష్ణాజిల్లా పెనమలూరు, సెప్టెంబర్ 15**

మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరులో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, పెనమలూరు శాసనసభ్యుడు బోడె ప్రసాద్ మంగళవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సామాజిక బాధ్యత నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ విజయవాడ నగరానికి, అమరావతి రాజధానికి సమీపంలో ఉన్న పెనమలూరు నియోజకవర్గంలో జనాభా, ఓటర్ల సంఖ్య వేగంగా పెరుగుతోందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారాయణ సహకారంతో భారీగా నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి వసతులకు ప్రాధాన్యం ఇచ్చి సమగ్ర అభివృద్ధి చేపడతామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కానూరులో ప్రధాన రహదారులు, మురుగునీటి కాలువలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాడిగడప మున్సిపాలిటీలో రూ.66 కోట్లతో రహదారులు, మురుగునీటి కాలువల పనులను చేపట్టి వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. సనత్‌నగర్, మన కల్యాణ మండపం, తులసీనగర్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక కాలువలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లతో రూపొందించిన సమగ్ర ప్రణాళిక కింద భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మట్టి రహదారులన్నింటినీ సిమెంట్ రహదారులుగా మార్చేందుకు రూ.50 కోట్ల విలువైన పనులకు గుత్తేదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందన్నారు.వర్షపు నీరు పొంగి ఇళ్లలోకి, పంట పొలాల్లోకి చేరకుండా రూ.50 కోట్లతో సమగ్ర మురుగునీటి కాలువల పనులకు త్వరలో గుత్తేదారులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఉపరితల జలాల ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించేందుకు రూ.500 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేశామని, తొలి విడతగా రూ.250 కోట్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.అలాగే కలవపాములలో రూ.70 లక్షలు, ఉప్పులూరులో రూ.70 లక్షల సామాజిక బాధ్యత నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 15:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ మంగళవారం పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భద్రత, రహదారులు, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎ.టి.వి. రవి కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వహణ ఇంజనీర్ సి. విశ్వనాథరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పిడుగుపాటు మృతుల కుటుంబాలకు తక్షణ సాయం అందించాలి

## - కలెక్టర్ కృతిక శుక్లాను కలిసిన ఎమ్మెల్యే

## డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 15:** నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో ఇటీవల భారీ వర్షాలు, పిడుగుపాటు కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు. మంగళవారం మృతుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను కలిసి పిడుగుపాటు మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలో నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, పిడుగుపాటు కారణంగా నలుగురు మృతి చెందిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించిన విషయాన్ని ఆమెకు వివరించారు. మృతుల కుటుంబాలు తీవ్ర



విషాదంలో ఉన్నందున ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం, ఇతర అర్హతగల సహాయాన్ని త్వరితగతిన అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ కృతిక శుక్లా సానుకూలంగా స్పందించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పిడుగుపాటు ఘటనపై వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత ఆర్డీవో బాలకృష్ణ ను బాధిత నాలుగు కుటుంబాలను పరామర్శించి, ఘటనలపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు.



# పార్టీలకు అతీతంగా సీఎం.ఆర్.ఎఫ్, ఎల్.ఓ.సీ సాయం : ప్రత్తిపాటి

## 74 మంది లబ్దిదారులకు రూ.43 లక్షల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 15 :** పేద, మధ్యతరగతి వర్గాల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, దేశంలో ఏ ప్రభుత్వం, ఏ నాయకుడు ఇవ్వని విధంగా ఉదారంగా సీఎం,ఆర్.ఎఫ్, ఎల్.ఓ.సీ అందిస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారుమంగళవారం ప్రత్తిపాటి స్థానిక క్యాంపు కార్యాలయంలో 74 మందికి రూ.43 లక్షల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ నగదు చెక్కుల్ని పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సీఎం.ఆర్.ఎఫ్ సాయం పంపిణీలో దేశంలో ఏపీయే మొదటి స్థానంలో ఉంటుందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి సకాలంలో నాణ్యమైన వైద్యసేవల్ని అందివ్వడంలో కూటమి ప్రభుత్వం మెరుగైన పనితీరు కనబరుస్తోందని ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, గట్టా హేమ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, షేక్ మస్తాన్ వలి, గుంజి శ్రీనివాసరావు, మద్దినేని సుబ్బారావు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక భావనతో ఆరోగ్యం మెరుగుపడుతుంది: ప్రత్తిపాటి

## హనుమాన్ , శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి చాలీసా పారాయణంలో పాల్గొన్న ప్రత్తిపాటి.



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 15 :**
తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆందోళన నుంచి మనిషి బయటపడాలంటే ఆధ్యాత్మికతే సులువైన మార్గమని, ఆధ్యాత్మిక భావనతో ప్రశాంతత లభించి, ఆరోగ్యం మెరుగుపడుతుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.మంగళవారం ప్రత్తిపాటి స్థానిక సింగు మినీ ఫంక్షన్ హాల్లో, శ్రీ వినాయక ట్రస్ట్ 9వ వినాయకచవితి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా మహిళలు పారాయణం చేసిన హనుమాన్, శ్రీ కన్యకాపరమేశ్వరి చాలీసాలను శ్రద్ధగా ఆలకించారు. అనంతరం చాలీసా పారాయణం చేసిన వారిని అభినందించిన ప్రత్తిపాటి.. వారిని ఉద్దేశించి మాట్లాడారు.ఆధ్యాత్మిక భావన మనిషి జీవితానికి వెలకట్టలేని ప్రయోజనాల్ని అందిస్తుందని, దైవచింతన, ధ్యానం, ప్రార్థన, యోగా వంటి సాధనల ద్వారా ప్రతి ఒక్కరూ పరిపూర్ణులు అవుతారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సాధన మనసుకు ప్రశాంతతను, మనిషికి ఆరోగ్యాన్ని అందిస్తుందని, మనిషి జీవితాన్ని సమతుల్యం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దైవం పట్ల అపారమైన నమ్మకం, విశ్వాసం ఉన్నవారు సమాజం పట్ల సేవాభావంతో ఎల్లప్పుడూ ప్రజలకు మంచి చేస్తారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మురకొండ మల్లిబాబు , కనమర్లపూడి రమేష్, నిర్వాహకులు పొట్టి వెంకట శివ రత్నబాబు, ఆలపాటి వెంకట్రావు, కొల్లా ఉమామహేశ్వరరావు, చంద్రపట్ల మణికుమార్, పి మధుబాబు, రామ లక్ష్మణ బ్రదర్స్, నరేష్, రాజేష్ తదితరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఈ-పంట నమోదును పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 15**



గూడూరు మండలంలో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి జ్యోతి రమణి మంగళవారం పరిశీలించారు. గూడూరులోని పలు ప్రాంతాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవడంతో పాటు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 7,800 హెక్టార్లలో ఈ-పంట నమోదు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లకు ఫార్మర్ ఐడీని అనుసంధానం చేసినందున ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.శివరామకృష్ణ, వీఏఏలు పూజ ప్రియదర్శిని, షేక్ నీలోఫర్, సుకన్య, రైతులు పాల్గొన్నారు.

# పేటలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 15 :**
చిలకలూరిపేట పురపాలక సంఘం కార్యాలయంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ డీఈ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత ఇంజనీర్, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాభివృద్ధిలో మరియు మౌలిక సదుపాయాల కల్పనలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని, విశ్వేశ్వరయ్య అంకితభావం, సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

- 6వ వార్డు బాబాపేటలో 'రెండేళ్ల నమ్మకంఅభివృద్ధిసంక్షేమం' కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 15:**



కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకంఅభివృద్ధిసంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నరసరావుపేట పట్టణంలోని 6వ వార్డు బాబాపేటలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల వద్దకు వెళ్తున్నామని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు.
6వ వార్డులో పేదలకు హౌసింగ్ ప్లాట్లు, గృహ రుణాల మంజూరుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందిన కుటుంబానికి పార్టీ తరఫున రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. అలాగే బాధిత కుటుంబానికి మరో రూ.2 లక్షల సహాయం అందినట్లు తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నాయకులు, కార్యకర్తలు కలిసి స్పందించి అండగా నిలవడం కూటమి నాయకత్వం లక్ష్యమని అన్నారు. బాబాపేటలోని మైనార్టీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైకిళ్లు కావాలని కోరిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అవసరమైన మేరకు సైకిళ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత వరకు లేదు, కాదు అనే పరిస్థితి లేకుండా పనిచేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ప్రజలు మద్దతు ఇవ్వాలని, నరసరావుపేట నియోజకవర్గంలో కూడా తనను మరోసారి గెలిపించే బాధ్యత ప్రజలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు ప్రెసిడెంట్ మోహన్ రావు, క్లస్టర్ ఇన్‌చార్జి గడ్డం కరిముల్లా, యామర్తి జాను, డీలర్లు షేక్ నజీర్, షేక్ కరీం, వెంకటాద్రి, లాలు, నరసరావుపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నాగస్వరపు సుబ్బరాయ గుప్తా, వైస్ చైర్మన్ షేక్ మీరవాలి, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ,
నాయకులు కొట్టా కిరణ్ కుమార్,ఏపీ బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేటలో మండలనేని మార్క్.. గణనాథుని మండపాల్లో చరణ్ తేజ విస్తృత పర్యటన



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 15 :**
చిలకలూరిపేట రాజకీయ ముఖచిత్రంపై, ముఖ్యంగా యువతలో జనసేన పార్టీ తరఫున సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రస్తుత వినాయక చవితి పర్వదిన మహోత్సవాలు అందుకు వేదికగా మారాయి. జనసేన నియోజకవర్గ యువ నాయకుడు, ప్రదాత మండలనేని చరణ్ తేజ చేపట్టిన వినాయక మండపాల పర్యటన.. పట్టణంలో రాజకీయ, ఆధ్యాత్మిక సందడిని రెట్టింపు చేసింది. నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్‌తో కలిసి ఆయన చేసిన పర్యటనకు అనూహ్య స్పందన లభించింది.

**వాడవాడలా ఆత్మీయ స్వాగతం.. విశేష పూజలు**

చిలకలూరిపేట పట్టణంలోని పలు కీలక ప్రాంతాలలో మండలనేని పర్యటన ఉత్సాహభరితంగా సాగింది. 2, 17, 18, 25, 26 వార్డులతో పాటు పోలిరెడ్డిపాలెం, ఎన్టీఆర్ కాలనీ, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ రోడ్, పాటిమీద, జాగుపాలెం, బొందిలిపాలెం, వడ్డెర బజార్, తూర్పు బజారు, బ్రహ్మంగారి గుడి సెంటర్,తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్దకు చరణ్ తేజ విచ్చేయగా, నిర్వాహకులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రతీ మండపం వద్ద విఘ్నేశ్వరునికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. స్థానికులు సైతం ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించడం ఆయన ఎదుగుతున్న గ్రాఫ్‌కు నిదర్శనంగా నిలిచింది.

**యువతలో వెల్లివిరిసిన నూతనోత్సాహం**

చరణ్ తేజ పర్యటన కేవలం ఆధ్యాత్మికానికే పరిమితం కాలేదు, స్థానిక జనసేన శ్రేణుల్లో నయా జోష్ నింపింది. ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి జనసేన నినాదాలతో హోరెత్తించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలు, యువతతో ఆయన మమేకమైన తీరు పార్టీ శ్రేణుల్లో సరికొత్త భరోసాను, ఉత్సాహాన్ని కల్పించింది.

**సమాజంలో ఆధ్యాత్మిక స్ఫూర్తి పెరగాలి: చరణ్ తేజ**

ఈ సందర్భంగా మండలనేని చరణ్ తేజ మాట్లాడుతూ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పండుగల ద్వారా సామాజిక ఐక్యత, ఆధ్యాత్మిక స్ఫూర్తి సమాజంలో మరింతగా పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో చరణ్ తేజ వెంట జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పట్టణ అధ్యక్షులు మునీర్ హాసన్, యాడ్ డైరెక్టర్ ఆముదాల లీల కిషోర్, పొనుగుబాటి పరమేశ్వరి, ఆమె బృంద సభ్యులు, వీర మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని మండలనేని పర్యటనను విజయవంతం చేశారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో ఏపీ వ్యవసాయ ఉత్పత్తులకు మంచి బ్రాండింగ్ : ఎమ్మెల్యే ప్రత్తిపాటి,ఎంపీ లావు.



- చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెంలో రూ.2.34 కోట్లతో నిర్మించనున్న కరివేపాకు ప్రాసెసింగ్ ప్లాంట్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు.

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 15 :**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, పథకాలతో రైతులు, పొదుపు సంఘాల మహిళలు ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, నాణ్యమైన ఏపీ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు, మంచి గిరాకీ లభిస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు.మంగళవారం వారు చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెంలో రూ.2.34 కోట్లతో నిర్మించనున్న కరివేపాకు ప్రాసెసింగ్ ప్లాంట్ కు, స్థానిక పొదుపు మహిళలు, రైతులతో కలిసి శంకుస్థాపన చేశారు. సెర్ప్, డీ.ఆర్.డీ.ఏ, వెలుగు విభాగాలు, చిలకలూరిపేట వ్యవసాయ ఉత్పత్తి దారుల సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించే కరివేపాకు ప్రాసెసింగ్ ప్లాంట్ కు శంకుస్థాపన అనంతరం బహిరంగ సభలో ఎమ్మెల్యే, ఎంపీ ప్రసంగించారు.

**- ప్రాసెసింగ్ ప్లాంట్లతో రైతుల కష్టానికి, మహిళల శ్రమకు మంచి లాభాలు, ప్రత్యేక గుర్తింపు: ప్రత్తిపాటి**

నరసరావు పేట పార్లమెంట్ లో ఒక్కో నియోజకవర్గానికి 4 ప్లాంట్ల చొప్పున మొత్తం 28 ప్రాసెసింగ్ ప్లాంట్లు మంజూరయ్యాయని, వీటి ఏర్పాటు వెనుక ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కృషి ఎంతో ఉందని ప్రత్తిపాటి చెప్పారు. పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలతో తీవ్ర నష్టాల చవిచూస్తున్న రైతాంగం కొత్త పంటల సాగు దిశగా మళ్లాలని, కరివేపాకు సాగుతో తక్కువ పెట్టుబడితో ఎకరాకు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. కట్టుబడివారిపాలెంలోనే 310 ఎకరాల కరివేపాకు సాగు చేపట్టారన్నారు. రైతుల కష్టానికి, పొదుపు మహిళల శ్రమకు తగిన ఫలితం అందించాలన్న సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కరివేపాకును వివిధ రూపాల్లో మార్కెటింగ్ చేయవచ్చని, ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. రైతులకు రుణాల మంజూరులో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలని ప్రత్తిపాటి సూచించారు. నరసరావుపేటలో భారీ రుణమేళా నిర్వహించి రూ.3,200 కోట్ల రుణాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా పంపిణీ చేయించడం ఎంపీ లావుకే సాధ్యమైందని ప్రత్తిపాటి ప్రశంసించారు.

**- చంద్రబాబు ఇమేజ్ తో రాష్ట్ర వ్యవసాయ, పొదుపు మహిళల ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు : ఎంపీ లావు**

నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలంలో అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, క్లస్టర్ల ఏర్పాటు చేస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఇది సాధ్యమైందని, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలియచేశారు. స్థానికంగా ఎక్కడికక్కడ ఎక్కువగా పండించే పంట ఉత్పత్తులకు అనుగుణంగా క్లస్టర్లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మహిళలు మనసు పెట్టి పనిచేస్తే అద్భుతాలు సాధిస్తారని, ఆ నమ్మకాన్ని నియోజకవర్గ మహిళలు మరోసారి నిజం చేయాలని లావు సూచించారు.అగ్రికల్చర్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 70 శాతం నిధులిస్తున్నాయని, పొదుపు సంఘాల మహిళలు 30శాతం భరిస్తే చాలని ఎంపీ చెప్పారు. ఏపీలో పండే కరివేపాకు ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్న లావు. వాటిని వివిధ రూపాల్లో ప్రాసెసింగ్ చేస్తేనే అధిక లాభాలు పొందవచ్చన్నారు. పాలను పాలుగా అమ్మకుండా, వివిధ ఆహార ఉత్పత్తులుగా మార్చి అమ్మినట్టు.. వ్యవసాయ ఉత్పత్తుల్ని కూడా పలురకాల ఉత్పత్తులుగా మార్చవచ్చన్నారు. చంద్రబాబు ఇమేజ్ తో రాష్ట్ర ఆహార ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి బ్రాండింగ్ లభించిందని, అరకు కాఫీ ఔట్ లెట్లు అనేక దేశాల్లో ఏర్పాటయ్యాయన్నారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు ప్రభుత్వం స్వయం పేరుతో ప్రత్యేక బ్రాండింగ్ కల్పించిందన్నారు. రాష్ట్ర డ్వాక్రా మహిళలు మరింత ఆర్థికాభివృద్ధిని సాధించాలని, కేరళ పొదుపు సంఘాల్ని స్ఫూర్తిగా తీసుకొని అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీ లావు సూచించారు. కేరళ పొదుపు సంఘాల మహిళలు దేశం గర్వించే అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నారన్నారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమవయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు చెన్నంశెట్టి సాంబశివరావు, చెన్నంశెట్టి ఏడుకొండలు, ముత్యాల వీరాంజనేయులు, బొమ్మసాని నాగార్జున, నాగంజనేయులు, డి.అర్.డి.ఎ. పిడి ఝాన్సీరాణి, హార్టికల్చర్ శ్రీలక్ష్మి, ఎండిఓ, ఎమ్మార్వో, సిబిఐ బ్యాంకు మేనేజర్, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కుపై యువతలో చైతన్యం పెంచాలి

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా, నైతికంగా ఓటు వేయాలి

**చీరాల, సెప్టెంబర్ 15, (పెన్ పవర్):**




ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం చీరాలలోని వై.ఏ. ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), వై.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళలు), విజ్ఞాన భారతి జూనియర్ కళాశాలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్2.0, స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల అవగాహన సదస్సులు నిర్వహించారు.జిల్లా నోడల్ అధికారి ఎల్. కోదండరామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్లు బి. సుబ్బారావు, ఎం. అనిల్ కుమార్, కత్తి అంకినీడు పాల్గొని విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. "నా ఓటునా భవిష్యత్తు" అనే నినాదంతో ప్రతి యువతీ యువకుడు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచించారు.

**ఓటరు సేవలపై అవగాహన**

18 ఏళ్లు నిండిన వారు ఫారం6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, భయాందోళనలకు లోనుకాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా, నైతికంగా ఓటు వేయాలని సూచించారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటరు జాబితాలో పేరు, వివరాలను పరిశీలించుకోవచ్చని, ఎన్నికల అక్రమాలు, నియమావళి ఉల్లంఘనలపై సి-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఎన్నికల సమాచారానికి 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

**విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ**

కార్యక్రమం ముగింపులో విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిర్భయంగా, నైతికంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల్లోనూ ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యూటీ అండ్ వెల్‌నెస్‌పై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన

- చీరాలలోని న్యూ లుక్ లేడీస్ అండ్ జెంట్స్ బ్యూటీ పార్లర్ సందర్శన
- వృత్తి నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి: టీచర్ హిమజ

**వేటపాలెం, సెప్టెంబర్ 15, (పెన్ పవర్) :**




సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రేడ్‌లో భాగమైన వేటపాలెం జడ్పీ హైస్కూల్ 9, 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజినీ సూచనలతో ఒకేషనల్ టీచర్ జి. హిమజ ఆధ్వర్యంలో చీరాలలోని న్యూ లుక్ లేడీస్ అండ్ జెంట్స్ బ్యూటీ పార్లర్‌ను విద్యార్థులు సందర్శించారు.తరగతి గదిలో నేర్చుకున్న నైపుణ్యాలను వాస్తవ పని విధానాలతో అనుసంధానం చేయడం ఈ సందర్శన ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్కిన్ కేర్, హెయిర్ కేర్, ఫేషియల్, మానిక్యూర్, పెడిక్యూర్ తదితర సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. బ్యూటీ పార్లర్‌లో వినియోగించే పరికరాలు, ఉత్పత్తులు, వాటి వినియోగ విధానాలపై అవగాహన పొందారు.పార్లర్‌లో పరిశుభ్రత, పరికరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, కస్టమర్ కేర్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను విద్యార్థులు గమనించారు. సేవలు అందించే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను కూడా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఒకేషనల్ టీచర్ జి. హిమజ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కస్టమర్ సర్వీస్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. బ్యూటీ అండ్ వెల్‌నెస్ రంగంలో ఉన్న ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలపై ప్రత్యక్ష అనుభవం విద్యార్థుల్లో ఆసక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు.లెవెల్-1, లెవెల్-2 విద్యార్థులకు ఈ ఇండస్ట్రియల్ విజిట్ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ఉపాధ్యాయులు యు. వేణుగోపాలరావు, జె. దేవ బిక్షం, జె. శ్రావణిలకు టీచర్ హిమజ కృతజ్ఞతలు తెలిపారు.

# అంబేద్కర్ గురుకులాన్ని కొనసాగించాలి

- దళిత బిడ్డల విద్యకు -అడ్డంకులు సృష్టించొద్దు
- వైసిపి ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వి సుబ్రహ్మణ్యం రెడ్డి

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,15:**

గూడూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోటలో ఎన్నో సంవత్సరాలుగా దళిత, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందిస్తూ ఆశాజ్యోతిగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను కొనసాగించాలని వైఎస్సార్సీపి ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వి సుబ్రహ్మణ్యం రెడ్డి డిమాండ్ చేశారు.మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కోటలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ గురుకుల పాఠశాల ద్వారా పరిసర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది పేద కుటుంబాల పిల్లలు విద్యను అభ్యసించారని వారు గుర్తుచేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో ఈ గురుకులం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని పేర్కొన్నారు.అలాంటి విద్యాసంస్థను ఎత్తివేయడం వల్ల ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని దళిత, పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి దూరం పెరగడంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని తెలిపారు.కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నప్పటికీ, దళిత విద్యార్థులకు ఉపయోగపడుతున్న గురుకుల పాఠశాలను ఎత్తివేయడం అందుకు విరుద్ధంగా ఉందని సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. దళిత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతున్నారు.-ఎమ్మెల్యే స్పందించాలి ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గంమైనగూడూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు. ఎస్సీ నియోజకవర్గంగా ఉన్న గూడూరులో దళిత విద్యార్థుల విద్యకు సంబంధించిన సమస్యను ఎమ్మెల్యే చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.కోటలోనే అంబేద్కర్ గురుకుల పాఠశాలను కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా అన్ని



వర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు."దళిత బిడ్డల చదువులు ఆగకూడదు.. కోటలోనే అంబేద్కర్ గురుకులం కొనసాగాలి" అనే డిమాండ్‌తో ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి.

# ప్రజాసేవే లక్ష్యం.. వికసిత్ భారతేవీ-2047 సంకల్పం

- 17 నుంచి నెలరోజుల పాటు బీజేపీ 'సేవా సంకల్ప్ అభియాన్'
- పార్టీ శ్రేణులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలి: కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా నెలరోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అభియాన్ కో-కన్వీనర్ కోలా ఆనంద్ తెలిపారు.శ్రీకాళహస్తిలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు, ప్రధానమంత్రిగా 12 ఏళ్లుగా నరేంద్ర మోదీ దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వివిధ సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారని, వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు.నెలరోజుల పాటు గ్రామస్థాయిలో 11



రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు పార్టీ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరాలు, 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం, విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, మొక్కలు నాటడం, ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాల జోరు పెంచి, ప్రజలతో మమేకమై అభియాన్‌ను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కోలా ఆనంద్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో





బీజేపీ కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమా, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కునాటి నాగరాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞాశ్రీ, రాష్ట్ర డైరెక్టర్ జీపాలెం తేజోవతి, మండల అధ్యక్షులు హరీష్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యం.. మట్టి వినాయకుడే ముద్దు!

- స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాచపాలెంలో ఘనంగా మట్టి విగ్రహాల పంపిణీ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు స్వస్తి.. ప్రకృతి హితమైన వినాయకుడిని పూజిద్దాం: వంశీ యాదవ్

**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పండుగల వేళ కూడా ప్రకృతిని కాపాడే విధంగా ప్రజలు పర్యావరణహిత పద్ధతులను పాటించాలని స్వేచ్ఛ ఫౌండేషన్ అధ్యక్షులు వంశీ యాదవ్ పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం రాచపాలెం గ్రామంలో స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమాన్ని వంశీ యాదవ్ ప్రారంభించి భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులతో తయారు




చేసిన విగ్రహాలను కాకుండా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు.

"రంగు బొమ్మలు వద్దు.. మట్టి వినాయకుడే ముద్దు"

మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా భక్తి భావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వంశీ యాదవ్ తెలిపారు. మట్టి విగ్రహాలు నిమజ్జనం సమయంలో సులభంగా కరిగిపోయి ప్రకృతిలో కలిసిపోతాయని, తద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు.

పండుగ అంటే భక్తి మాత్రమే కాదు.. ప్రకృతిపై బాధ్యత కూడా అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణ కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

వినాయక చవితి సందర్భంగా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం పట్ల రాచపాలెం గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. పర్యావరణహిత కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేళ ముక్కంటి సేవలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

- కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్ల దర్శనం.. భక్తుల సౌకర్యాలపై ఆరా
- ఆలయ పరిశుభ్రత, క్యూలైన్లు, మంచినీటి వసతులపై అధికారులకు కీలక సూచనలు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కుటుంబానికి అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ అమ్మవారితో కూడిన శ్రీకాళహస్తీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు

దర్శనానంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ముక్కంటి స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని, ప్రజల సంక్షేమం,



అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

దర్శనం అనంతరం ఎమ్మెల్యే ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, భక్తులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. ఆలయ ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, మంచినీటి వసతి, క్యూలైన్ల నిర్వహణను మరింత మెరుగుపరచాలని ఆలయ అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

యాత్రికులతో ఎమ్మెల్యే ముచ్చట్లు

దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఎమ్మెల్యే నేరుగా ముచ్చటించి స్వామివారి దర్శనం ఎలా జరిగింది, ఆలయంలో అందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఇంకా ఏయే వసతులు అవసరమో అడిగి తెలుసుకున్నారు. భక్తులు వెల్లడించిన సమస్యలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరణ

అనంతరం ఆలయ నిత్య అన్నదాన సత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సాధారణ భక్తులతో కలిసి కూర్చొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భోజన నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించిన ఆయన భక్తులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన అన్నప్రసాదాన్ని నిరంతరం అందించాలని నిర్వాహకులకు సూచించారు. భోజనశాల పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో ముక్కంటి సన్నిధికి వచ్చిన ఎమ్మెల్యే.. ఒకవైపు స్వామివారి ఆశీస్సులు కోరుతూ, మరోవైపు భక్తుల సమస్యలను స్వయంగా తెలుసుకుని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఇంజనీర్లకు పురస్కారాలు.. ఘన సత్కారం..

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 15:**



భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని నంద్యాలలో పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్, డిప్లమా ఇంజనీర్ల సంఘం, సచివాలయ ఇంజనీర్ల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది ఇంజనీర్లు రక్తదానం చేశారు. ఉత్తమ సేవలు అందించిన ఏడుగురు అసిస్టెంట్ ఇంజనీర్లు, 29 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రశంసా పత్రాలు, పురస్కారాలు అందజేశారు. క్రికెట్, షటిల్, చెస్, క్యారమ్స్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు.నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి, విశ్రాంత ఇంజనీర్లు మురహరి రావు, పి. రాముడులకు జాతీయ ఇంజనీర్ల దినోత్సవ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. నవజీవన్ బదిరుల పాఠశాలకు క్రీడా పరికరాల కోసం రూ.12 వేల విరాళం అందించారు.ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో యువ ఇంజనీర్లు జాతి నిర్మాణంలో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ తదితరులు ఇంజనీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇంజనీర్ సంఘాల ప్రతినిధులు, ఇంజనీర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బాలాజీ అపార్ట్మెంట్‌లో వినాయక చవితి వేడుకలు

- 30 కుటుంబాల సమష్టి భాగస్వామ్యంతో ఘనంగా పూజలు
- ఐకమత్యంతో పండుగను నిర్వహించుకున్న అపార్ట్మెంట్ వాసులు



**చీరాల, సెప్టెంబర్ 15, (పెన్ పవర్) :**

బాలాజీ అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ నక్కల శారద, అపార్ట్మెంట్ సభ్యులు నాగేశ్వరరావు, చంద్రమౌళి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అపార్ట్మెంట్‌లోని 30 ఫ్లాట్లకు చెందిన కుటుంబాలు సమష్టిగా పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దాసరి రామకృష్ణ, ఆయన ధర్మపత్ని శారద, డైమండ్ వాటర్ శివ, ఆయన ధర్మపత్ని బాల త్రిపుర సుందరి, శెట్టి భాస్కర్, ఆయన ధర్మపత్ని వర్ధిని, రామనాథం దంపతులు, కాకరపర్తి శ్రీనివాసరావు, ఆయన ధర్మపత్ని పద్మ, కాకరపర్తి రమేష్, ఆయన ధర్మపత్ని కృష్ణకుమారి, కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.కుటుంబ సమేతంగా పాల్గొన్న అపార్ట్మెంట్ వాసులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ప్రేమ, ఆప్యాయతలు, ఐకమత్యంతో వాసులంతా కలిసి పండుగను జరుపుకోవడంతో బాలాజీ అపార్ట్మెంట్‌లో ఆధ్యాత్మిక, సందడితో కూడిన పండుగ వాతావరణం నెలకొంది.

# విద్యార్థుల భద్రతపై పోలీసుల అవగాహన

- శక్తి యాప్, పోక్సో చట్టం, గుడ్ టచ్‌బ్యాడ్ టచ్‌పై అవగాహన
- సైబర్ నేరాలు, ఫేక్ న్యూస్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన

**జాండ్రపేట, సెప్టెంబర్ 15, (పెన్ పవర్):**




బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎండి మోయిన్ సూచనలతో చీరాల వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో జాంద్రపేటలోని బీవీ అండ్ బి ఎన్ గర్ల్స్ హైస్కూల్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీరాల వన్‌టౌన్ సీఐ జి. సోమశేఖర్ సూచనల మేరకు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి, చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం కానిస్టేబుల్ కే. సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, మహిళలకు అత్యవసర సమయంలో అందే సహాయం, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించి, ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే తల్లిదండ్రులకు లేదా పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు.

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో వచ్చే ఫేక్ న్యూస్, అనుమానాస్పద సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 181, 1091, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పోక్సో చట్టం, మహిళల రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి, కానిస్టేబుల్ కే. సుబ్బారావుతో పాటు పాఠశాల ఐసీ ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ నాగమణి, సీనియర్ ఉపాధ్యాయులు జి. శాంసన్, సహాయ ఉపాధ్యాయురాలు వై. రాజకుమారి, మ్యాథ్స్ అసిస్టెంట్ పి. వెంకట్రావు, సైన్స్ అసిస్టెంట్ బి. వెంకటేశ్వర్లు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంజినీర్స్ డే వేడుకల్లో పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం

- వివిధ హోదాల్లో సేవలందించిన విశిష్ట ఇంజినీర్లకు ఘనంగా సత్కారం
- సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకున్న విద్యా సంస్థల ప్రతినిధులు




**చీరాల, సెప్టెంబర్ 15 (పెన్ పవర్):**

ఇంజినీర్స్ డే సందర్భంగా భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకుంటూ బండ్ల బాపయ్య విద్యా సంస్థల్లో చదివి ఇంజినీర్లుగా వివిధ హోదాల్లో సేవలందించి పదవీ విరమణ చేసిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ బొడ్డు వీరమల్లు, బండ్ల అంకయ్య, కోడూరి ఏకాంబరేశ్వర బాబు, కర్ణ వీర్రాజులను సత్కరించారు. డాక్టర్ బొడ్డు వీరమల్లు 1968 నుంచి 1975 వరకు బండ్ల బాపయ్య విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేసి ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. అమెరికా ప్రభుత్వంలో సేవలందించిన ఆయన ప్రస్తుతం కెంటకీ క్లీన్ ఫ్యూయల్స్ కోయలిషన్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు.బండ్ల అంకయ్య 19601966 మధ్య విద్యాభ్యాసం చేసి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎం.టెక్ పూర్తి చేసి పదవీ విరమణ చేశారు. కోడూరి ఏకాంబరేశ్వర బాబు 19601966 మధ్య విద్యాభ్యాసం చేసి మణిపాల్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పట్టా పొంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సేవలందించారు. కర్ణ వీర్రాజు 19721975 మధ్య బండ్ల బాపయ్య కళాశాలలో చదివి అనంతరం మెకానికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి ఏకేపీ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా సేవలందించారు.ఈ కార్యక్రమంలో బండ్ల బాపయ్య విద్యా సంస్థల కమిటీ అధ్యక్షులు బండ్ల అంకయ్య, వైస్ ప్రెసిడెంట్ కోడూరి ఏకాంబరేశ్వర బాబు, సెక్రటరీ చల్లా వాసుదేవరావు, జాయింట్ సెక్రటరీ బండ్ల రవీంద్రనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ బండ్ల బాపయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని సన్మానిత ఇంజినీర్లను అభినందించారు.

# కేశినేని చిన్న కొడుకు పొలిటికల్ ఎంట్రీ..

**విజయవాడ, సెప్టెంబర్ 15, పెన్ పవర్:**
విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కుమారుడు వెంకట్ రాజకీయాల్లోకి వస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆయన మేయర్ రేసులో ఉన్నారంటూ కొంతమంది పోస్టులు పెట్టారు. ఈ ప్రచారంపై ఎంపీ చిన్ని స్పందించారు. తన కుమారుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. తన కుమారుడు ప్రస్తుతం వ్యాపార కార్యలకలాపాలలో ఉన్నట్లు తెలిపారు విజయవాడ ఎంపీ చిన్ని.విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) కుమారుడు వెంకట్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారా?. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారా? అంటూ కొద్దిరోజులుగా కేశినేని చిన్ని కుమారుడి పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. వెంకట్ విజయవాడ మేయర్ రేసులో ఉన్నారంటూ కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు. తాజాగా ఈ అంశంపై ఎంపీ కేశినేని చిన్ని స్పందించారు.. తన కుమారుడి రాజకీయ ప్రవేశంపై స్పష్టత ఇచ్చారుతన కుమారుడు కేశినేని వెంకట్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని.. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టత ఇచ్చారు ఎంపీ కేశినేని చిన్ని. వెంకట్ ప్రస్తుతం తన వ్యాపార కార్యకలాపాలకు మాత్రమే పరిమితం అయ్యారని.. క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారని తెలిపారు. కాబట్టి ఇటువంటి నిరాధారమైన ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు.విజయవాడ మేయర్ రేసులో 'జెన్ జీ' మార్క్.. కేశినేని వెంకట్ బాబు విజన్ అండ్ మిషన్ అంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు.విజయవాడ నగర కార్పొరేషన్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కుమారుడు కేశినేని వెంకట్ మేయర్ రేసులో నవతరం



ఆలోచనలకు ప్రతీకగా, 'జెన్ జీ' ప్రతినిధిగా రంగంలోకి దిగుతున్నారన్నారు. నగర యువత ఆకాంక్షలను చట్టసభలు, పాలనా వేదికలపై వినిపించేందుకు సిద్ధమవుతున్నారనేది ఆ పోస్ట్ సారాంశం.అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహనతో విజయవాడను సాంకేతికతతో అనుసంధానించిన 'స్మార్ట్ సిటీ'గా మార్చడమే ప్రధాన ధ్యేయమని పోస్ట్‌లో ప్రస్తావించారు. యువత -- ఉపాధి -- స్కిల్ హబ్స్: స్థానిక యువత కోసం ఐటీ/స్టార్టప్ అవకాశాలు పెంపొందించడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు స్థాపించడం మరియు క్రీడా ప్రాంగణాలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఎంపీ కేశినేని చిన్ని ప్రజాసేవా నిబద్ధతతో డివిజన్ల వారీగా స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతారన్నారు. పచ్చదనం ఒ ఆధునిక మౌలిక వసతులు: భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, ఆధునిక పారిశుధ్య యాజమాన్యం, సులభతర రవాణా మరియు కెనాల్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు స్పష్టమైన రోడ్ మ్యాప్ ఉందన్నారు. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా పరిపాలనలో వేగం, పారదర్శకత తీసుకొస్తూ.. విజయవాడ నగర అభివృద్ధికి సరికొత్త దిశానిర్దేశం చేయడానికి వెంకట్ బాబు రాక నగరంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోందని ప్రచారం చేస్తున్నారు. ఈ పోస్టులపై కేశినేని చిన్ని స్పందించారు.. తన కుమారుడి పొలిటికల్ ఎంట్రీపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని.. క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారని స్పష్టత ఇచ్చారు.

# జగన్ మైండ్ గేమ్ స్టార్ట్...

**నెల్లూరు, సెప్టెంబర్ 15, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పిలుపులు, వేస్తున్న పావులు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆయన సాగిస్తున్న సుదీర్ఘ పోరాటంలో.. అనూహ్యంగా అధికార కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ప్రభుత్వం ఎన్ని రకాల వివరణలు ఇచ్చినా, గణాంకాలు ముందుంచినా డీఎస్సీపై తన ఆరోపణలకే కట్టుబడి ఉన్న జగన్.. ఈ క్రమంలో టీడీపీతో సాగుతున్న కూటమి నుంచి బీజేపీ, జనసేన తక్షణమే బయటకు రావాలి అని డిమాండ్ చేయడం వెనుక ఎలాంటి వ్యూహం ఉందనేది ఆసక్తికరంగా మారింది.గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ పెద్దలతో జగన్‌కు ఉన్న సాన్నిహిత్యం బహిరంగ రహస్యమే. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కానీ, ప్రతిపక్షంలోకి వచ్చాక కానీ ఆయన కేంద్ర ప్రభుత్వంపై లేదా ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు చేసిన దాఖలాలు లేవు. అలాంటి జగన్, ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి నుంచి బీజేపీ, జనసేన వైదొలగాలని గొంతు ఎత్తడం వెనుక ప్రధానంగా కూటమి ఐక్యతను దెబ్బతీసే పెద్ద వ్యూహం దాగి ఉందనేది పొలిటికల్ ఎనలిస్టుల ప్రాథమిక అంచనా. 2024 ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్లే వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు లేదా భవిష్యత్ సమరాల నాటికి ఈ బంధంలో



చీలికలు తెస్తే తప్ప, రాజకీయంగా కోలుకోవడం కష్టమనే ఆలోచనతోనే జగన్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారని భావించవచ్చు.డీఎస్సీ వివాదాన్ని కేవలం విద్యాశాఖ , టీడీపీ ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే కాకుండా, మొత్తం కూటమి ప్రభుత్వ నైతిక వైఫల్యంగా చిత్రించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని మండిపడుతున్న ఆయన, ఈ పాపంలో బీజేపీ, జనసేనలు కూడా భాగస్వాములు కాకూడదంటే వెంటనే బయటకు రావాలని నైతిక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి భాగస్వామ్య పక్షాల్లో అంతర్గత అనుమానాలను, విభేదాలను రేకెత్తించడం ద్వారా టీడీపీని ఒంటరిని చేయాలనేది జగన్ వ్యూహంలో భాగం. ఇటీవల కాక్రోచ్ కామెంట్స్, పోరాట వ్యూహాలపై జగన్ మాట్లాడిన తీరును చూస్తే.. ఇది కేవలం కూటమిని విచ్ఛిన్నం చేసే వ్యూహమే కాకుండా, రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీపై కూడా పూర్తిస్థాయిలో వ్యతిరేక గళం విప్పడానికి ఇస్తున్న ముందస్తు సంకేతామా అనే కోణంలోనూ విశ్లేషణలు సాగుతున్నాయి. ఇన్నాళ్లూ కేంద్రంతో మైత్రిని కొనసాగించినా తమకు దక్కిన రాజకీయ ప్రయోజనం ఏమీ లేదని, ప్రతిపక్షంగా నిలదొక్కుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒకేసారి విరుచుకుపడటమే ఏకైక మార్గమని వైఎస్ఆర్‌సీపీ భావిస్తూ ఉండవచ్చు.ఈ విమర్శలు ఫలిస్తాయా అంటే ఆచరణలో అది సాధ్యపడేలా కనిపించడం లేదు. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన, కేంద్రంలోని బీజేపీ నాయకత్వం టీడీపీతో అత్యంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్నాయి. జగన్ చేస్తున్న ఈ డిమాండ్లను కూటమి నేతలు తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, క్యాడర్‌లో ఉత్సాహం నింపడానికి జగన్ ఆడుతున్న మైండ్ గేమ్ ఇది తప్ప, దీనివల్ల కూటమి విచ్ఛిన్నమయ్యే అవకాశం శూన్యమని అధికార పక్షం కౌంటర్ ఇస్తోంది. డీఎస్సీ అక్రమాల నెపంతో కూటమి పునాదులను కదిలించేందుకు జగన్ చేస్తున్న ఈ ప్రయత్నం ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తుందో లేక కేవలం ఒక రాజకీయ ప్రకటనగానే మిగిలిపోతుందో వేచి చూడాలి.

# వైసీపీకి భీమిలి టెన్షన్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 15, పెన్ పవర్:**
భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు ఆ పార్టీని వీడటం పొలిటికల్ ఈక్వేషన్స్‌ను మార్చేస్తుంది. గ్రేటర్ విశాఖ పరిధిలో ఉన్న భీమిలి రాజకీయంగా చాలా ప్రాముఖ్యత ఉన్న నియోజకవర్గం. ఈ సెగ్మెంట్‌లో పట్టు పెంచుకోవాలని వైసీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో ప్రయోగాలు చేస్తూ వస్తుంది. ఒక్క 2019లో పార్టీ వేవ్ వచ్చినప్పుడు మినహా.. 2014, 2024లో రెండుసార్లు ఫ్యాన్ పార్టీ ఇక్కడ ఓడిపోయింది. అయితే ఇప్పుడు చిన్న శ్రీను తర్వాత భీమిలిలో వైసీపీకి పెద్దదిక్కెవరు అనేది బిగ్ క్వశ్చన్ మార్క్‌గా మారింది. పార్టీ, క్యాడర్ లీడర్లను ముందుండి నడిపించడమే కాకుండా..చిన్న శ్రీను ప్లేస్‌ను రీప్లేస్ చేసే లీడర్ ఎవరు.? మళ్లీ కొత్త నేతను తెరపైకి తెస్తారా.? విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏదో ఒక నియోజకవర్గ ఇంచార్జ్‌ను వైసీపీ అధిష్టానం భీమిలికి షిఫ్ట్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది.కొత్త చట్టాలను పరిశీలించండివిశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది. టీడీపీ ఆవిర్భవించిన తర్వాత ఇప్పటిదాకా పది సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే భీమిలిలో టీడీపీ ఏడు సార్లు గెలిచింది. కాంగ్రెస్ ప్రజారాజ్యం, వైసీపీ ఒక్కోసారి గెలిచాయి. ఇక భీమిలిలో 2019లో వైసీపీ గెలిచినా రాజకీయంగా పట్టు సాధించలేకపోయింది. మూడు వర్గాలు ఆరు గ్రూపులు అన్నట్లుగా అంతర్గత కుమ్ములాటలతో సరిపెట్టారు. మరోవైపు భీమిలీ వైసీపీ నాయకత్వ బాధ్యతలు ఎవరికి ఇచ్చినా వారు తప్పుకోవడం నెగెటివ్ సెంటిమెంట్‌గా టాక్ నడుస్తోంది. దాంతో విశాఖ జిల్లాలో రాజకీయంగా ఎంతో కీలకమైన ఈ నియోజకవర్గంలో వైసీపీ ఇప్పుడు అయోమయంలో



పడిపోయినట్లు అవుతోంది.భీమిలి ఇంచార్జ్‌గా 2024 డిసెంబర్‌లో చిన్న శ్రీనుకు బాధ్యతలు అప్పగించింది వైసీపీ అధినాయకత్వం. దాదాపుగా రెండేళ్ల పాటు ఆయన పార్టీ బాధ్యతలను చూస్తూ వచ్చారు. అంగబలం అర్ధ బలం ఉండటంతో పాటు బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయన భీమిలిలో వైసీపీని పటిష్టం చేసేందుకు ఎంతో కొంత శ్రమించారు. ఆయనే 2029 ఎన్నికల్లో భీమిలి నుంచి ఎమ్మెల్యేగా వైసీపీ తరపున చేస్తారని అంతా అనుకున్నారు. కానీ స్థానిక ఎన్నికల ముందే ఆయన సడెన్‌గా ఫ్యాన్ నీడ నుంచి బయటకు వచ్చి సైకిలెక్కేశారు. దాంతో లోకల్ ఫైట్ దూసుకొస్తున్న వేళ వైసీపీ ఇక్కడ నాయకత్వ లేమితో సతమతమవుతోంది. వైసీపీ గడచిన మూడు ఎన్నికల్లో ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చింది. అందులో 2014లో వైసీపీ నుంచి పోటీ చేసిన కర్రి రాము అయితే అప్పట్లో ఓడిపోగానే వైసీపీకి రాజీనామా చేశారు.రాజకీయ వార్తలు చదవండి2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరిన అవంతి శ్రీనివాస్ భీమిలి నుంచి పోటీ చేసి గెలిచి మంత్రి అయ్యారు. 2024 ఎన్నికల్లో కూడా ఆయనే పోటీ చేశారు. తీరా ఓటమి చెందగానే పార్టీకి రాజీనామా చేశారు. ఆయన ప్లేస్‌లో చిన్న శ్రీనును ఇంచార్జ్‌గా పెడితే..సరిగ్గా స్థానిక ఎన్నికల వేళ ఆయన సైకిల్ ఎక్కేయడంతో వైసీపీ క్యాడర్ ఆందోళన చెందుతోంది. లోకల్ బాడీస్‌లో ఏకగ్రీవాలు జరగనిచ్చే ముచ్చటే లేదని వైసీపీ అంటోంది. కానీ భీమిలీ సీటులో ఆ పార్టీకి ఇంచార్జే లేదు. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎవరిని తెచ్చిపెట్టినా కూడా ఆయన అందరికీ పరిచయం అయ్యేలోపే స్థానిక ఎన్నికల అయిపోతాయని అంటున్నారు.మరోవైపు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అన్ని విధాలుగా రాజకీయంగా పట్టు బిగించారు. దానికి తోడు భీమిలిలో జనసేన, టీడీపీ రెండూ కూడా బలంగా ఉన్నాయి. భీమిలి ఇంచార్జ్ విషయంలో వైసీపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి

## రాజకీయాలలో కులాల పట్టింపులు

**ఏలూరు, సెప్టెంబర్ 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. సహజంగానే ఏపీ రాజకీయాలలో కులాల పట్టింపులు ఎక్కువగా ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇవి ఎక్కువ ప్రభావం చూపిస్తుంటాయి.2024 లో జరిగిన ఎన్నికల్లో ఏపీ రాష్ట్రంలో జనసేన, బిజెపి, టిడిపి కలిసి పోటీ చేశాయి. కూటమిగా ఏర్పడి అధికారాన్ని దక్కించుకున్నాయి. మూడు పార్టీలకు కూటమి ప్రభుత్వంలో సముచిత ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఏపీ అభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీలకు తన ప్రాధాన్యం దక్కే విధంగా ఆయన అడుగులు వేస్తున్నారు.మూడు పార్టీల అధినాయకులు ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం ఉండే విధంగా ఆలోచనలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి మరో విధంగా ఉంది. కొంతమంది ఎమ్మెల్యేలు.. మిగతా నాయకులు వేరే విధంగా వ్యవహరిస్తున్నారు. వైసిపికి లాభం చేకూర్చే విధంగా మాట్లాడుతున్నారు. సహజంగానే ఇలాంటి అవకాశం కోసం వైసిపి ఎదురుచూస్తూ ఉంటుంది. పైగా ఆ పార్టీ చేతిలో మీడియా ఉంది. అందువల్లే జనసేన, టిడిపి, బిజెపి లో దిగువ స్థాయి నాయకుల అసంతృప్తి వ్యాఖ్యలకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తూ ఉంది. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ప్రజల్లో నాయకులు చులకన అవుతారు. కానీ ఆ విషయం కూటమిలోని పార్టీల కిందిస్థాయి నాయకులకు అర్థం కావడం లేదు.తాజాగా జనసేన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ఎన్నికల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. జనసేన గెలిచిన చోట టిడిపి వాళ్ళను గౌరవిస్తున్నామని.. టిడిపి వాళ్ళు గెలిచిన చోట జనసేన నాయకులను గౌరవించడం లేదని.. ఈ సమస్య మీద నేరుగా ఒకే చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ తో మాట్లాడుతామని శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు. గడచిన కొంతకాలంగా కార్యకర్తల బాధ చూశామని.. ఇకపై వారు బాధపడకుండా చూసుకుంటామని శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యకర్తల ప్రవర్తన ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని.. స్థానిక ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యతను భుజాలకు ఎత్తుకుంటామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు.ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఇటువంటి వ్యాఖ్యలను అంతర్గతంగా చేసుకోవాలి. సాధారణంగా ఒక కుటుంబంలో ఎన్నో సమస్యలు ఉంటాయి.. సానుకూల ధోరణిలో మాట్లాడుతూ ఉంటే ఆ సమస్యలు పరిష్కారం అవుతూ ఉంటాయి. కూటమిగా ఉన్న మూడు పార్టీలలో కూడా సమస్యలు లేవని కాదు. కాకపోతే వాటిని సానుకూల దృక్పథంతో చర్చించుకుంటే బాగుంటుంది. అలాకాకుండా ఇలా అసంతృప్తి వ్యక్తం చేస్తుంటే సమస్యలు వెలుగు చూస్తూనే ఉంటాయి. ఇక్కడ జనసేన నాయకులకు టిడిపి ఎమ్మెల్యేలు గౌరవం ఇవ్వాలి. వాళ్ల సమస్యలను పరిష్కరించుకోవాలి. ఏదైనా ఉంటే కలిసి మాట్లాడుకోవాలి. అలాకాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే మొదటికే మోసం వస్తుంది. స్థానిక ఎన్నికల సమయంలో ఇటువంటి ధోరణి కొనసాగిస్తే కూటమికి మొదటికే మోసం వస్తుంది.

## స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల ఉద్యోగులకు కొత్త బాధ్యతలు..

**విజయవాడ, సెప్టెంబర్ 15, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బీసీ వసతి గృహాల్లో కేర్ టేకర్లను నియమించనుంది. మొత్తం వి222 మందిని విద్యార్థుల సంరక్షణ కోసం నియామకం చేపట్టనుంది. ఈ హాస్టల్స్‌లో కేర్ టేకర్లుగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 98 మంది మహిళా పోలీసులు, 124 మంది వీఆర్ఏలను నియమించాలని నిర్ణయించారు. త్వరలోనే వీరిని ఈ కేర్ టేకర్ పోస్టుల్లో నియమించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల సంరక్షణ కేర్ టేకర్లను నియమించనుంది. రాష్ట్రవ్యాప్తంగా కేర్ టేకర్లనుగా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 98మహిళా పోలీసులు, 124మంది వీఆర్ఏలను నియమించాలని నిర్ణయించింది. ఈ కేర్ టేకర్ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తున్నారో ఇప్పటికే స్వర్ణ సచివాలయ అధికారులు బీసీ సంక్షేమశాఖ అధికారులకు నివేదిక పంపించారు. ప్రస్తుతం ఈ ఉద్యోగులంతా సర్ ప్రక్రియలో ఉన్నారు.. ఆ బాధ్యతలు ముగియగానే వసతి గృహాల్లో కేర్ టేకర్ విధుల్లో చేరనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 993 వసతి గృహాల్లో 85 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. వీటిలో 400కుపైగా హాస్టళ్లలో వార్డెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వార్డెన్లకు రెండు, మూడు హాస్టళ్లకు ఇంఛార్జులుగా నియమించారు. ఈ సమస్యను గమనించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా 222 మంది కేర్ టేకర్లను నియమించాలని నిర్ణయం తీసుకుంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల మహిళా పోలీసులు, వీఆర్ఏలు వార్డెన్ విధుల్ని నిర్వహిస్తారు. వసతి గృహాల్లో రోజూ మూడు పూటల విద్యార్థులకు అందుబాటులో ఉటంటారు.. వారందిరి పరిరక్షణ బాధ్యతల్ని కేర్ టేకర్లుగా వీరే నిర్వర్తించనున్నారు.హాస్టళ్లలో విద్యార్థులకు చిన్న చిన్న ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాల్ని ప్రభుత్వం సమకూరుస్తోంది. హ్యాంగర్లు, డ్రైయింగ్ హ్యాంగర్లు, బాత్‌రూంలో అవసరమైన వస్తువుల్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. దీని కోసం జిల్లా కలెక్టర్లకు రూ.4.95 కోట్ల నిధులు ఇప్పటికే విడుదలయ్యాయి. అలాగే హాస్టల్స్‌లోకి దోమలు రాకుండా మస్కిటో ప్రూఫింగ్ ఏర్పాటు చేయిస్తోంది.. పారిశుధ్య నిర్వహణకు శానిటేషన్ కిట్లు కూడా అందిస్తున్నారు. మొత్తం 16 జిల్లాలోని 130 హాస్టళ్ల పరిధిలో రూ.16.55 కోట్లు వెచ్చించి మరమ్మతులు చేయిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి ఆదేశాలిచ్చింది. ఏపీపీఎస్సీ ద్వారా తొలిసారి అసిస్టెంట్ సర్జన్ పోస్టులు భర్తీ చేయనున్నారు. అకడమిక్ పనితీరు, ఉన్నత విద్యాభ్యాసం, సర్వీసు అనుభవం, గ్రాడ్యుయేషన్ తర్వాత సీనియారిటీ ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపడతారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు

## ఆరు లైన్లు రహదారి అడుగులు

**గుంటూరు, సెప్టెంబర్ 15, పెన్ పవర్:**
తెలుగు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన రహదారుల్లో నేషనల్ హైవే 65 ఒకటి. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లే కీలకమార్గాల్లో ఒకటైన ఈ హైదరాబాద్– విజయవాడ మధ్య రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర రహదారి, రవాణా శాఖ కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఎన్‌హెచ్–65 రహదారిని 6 వరుసలుగా విస్తరించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ విస్తరణ ప్రాజెక్టులో భాగంగా నల్గొండ జిల్లా పరిధిలోని 62.20 కిలోమీటర్ల నుంచి 126.800 కిమీ వరకు రహదారిని విస్తరించనున్నారు. ఇందుకోసం జాతీయ రహదారుల చట్టం–1956లోని సెక్షన్ 3ఏ(1) కింద కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను సైతం జారీ చేసింది.నేషనల్ హైవే 65 రోడ్డు విస్తరణ పనుల కోసం నల్గొండ జిల్లాలోని చిట్యాల, కట్టంగూర్, నార్కెట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలాల పరిధిలో భూసేకరణ చేయనున్నారు. వీటిలోని వెలిమినేడు, వట్టిమర్తి, చిట్యాల, నార్కెట్‌పల్లి, యల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, పామనగుండ్ల, దుగ్నేవల్లి, అయిటిపాముల, చందంపల్లి, నకిరేకల్, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల పరిధిలోని 70 సర్వే నంబర్ల నుంచి మొత్తం 6.32 హెక్టార్ల వ్యవసాయ, వ్యవసాయేతర భూములను ఈ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సేకరించనుంది.ప్రభుత్వం జారీ చేసిన ఈ భూసేకరణ నోటిఫికేషన్‌పై ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉన్న భూఉజమానులు లేదా సంబంధిత వ్యక్తులు 21 రోజుల్లోగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (=ఞూ)కి నివేదించుకోవాలని అందులో సూచించారు. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన తరువాత అధికారులు ల్యాండ్ అక్విజిషన్ ప్రాజెక్టుకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారని తెలుస్తోంది. హైదరాబాద్– విజయవాడ రూట్ 6 లేన్లుగా విస్తరిస్తే ముఖ్యంగా పండుగ సమయాల్లో ఏర్పడే భారీ రద్దీని కొంతమేర నియంత్రించే అవకాశం ఉంటుంది.

# సచిన్ టెండూల్కర్ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసిన జింబాబ్వే ఆటగాడు

- సచిన్ సుదీర్ఘ వన్డే కెరీర్ రికార్డును బద్దలు కొట్టిన బ్రెండన్ టేలర్
- ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో బరిలోకి దిగి ఈ ఘనత
- 22 ఏళ్ల 146 రోజుల కెరీర్‌తో ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా గుర్తింపు
- 2027 ప్రపంచకప్ లక్ష్యంగా మళ్లీ జాతీయ జట్టుకు ఆడుతున్న టేలర్




**హైదరాబాద్ పెన్ పవర్:** జింబాబ్వే వెటరన్ వికెట్ కీపర్ బ్యాటర్ బ్రెండన్ టేలర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న సుదీర్ఘ వన్డే కెరీర్ రికార్డును టేలర్ బద్దలు కొట్టాడు. నేడు హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బరిలోకి దిగడం ద్వారా ఈ ఘనత సాధించాడు. తద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో తన పునరాగమనాన్ని చిరస్మరణీయం చేసుకున్నాడు. 2004లో వన్డే అరంగేట్రం చేసిన బ్రెండన్ టేలర్, తన కెరీర్‌ను 22 ఏళ్ల 146 రోజులకు విస్తరించాడు. దీంతో ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘకాలం వన్డేలు ఆడిన ఆటగాడిగా కొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు సచిన్ టెండూల్కర్ (22 ఏళ్ల 91 రోజులు) పేరిట ఉండేది. టేలర్ కెరీర్ ఎన్నో ఎత్తుపల్లాలతో నిండి ఉంది. జింబాబ్వే తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా (6,704) కొనసాగుతున్న టేలర్, 2015 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఇంగ్లండ్‌లో కోల్‌పాక్ ఒప్పందంపై ఆడాడు. రెండేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి తిరిగి వచ్చినా, 2021లో మరోసారి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆ తర్వాత 2019లో కొందరు బుకీలు తనకు కొకైన్ ఇచ్చి ం

బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించారని, ఆ విషయాన్ని ఐసీసీకి చెప్పడంలో ఆలస్యం చేసినందుకు మూడున్నరేళ్ల నిషేధానికి గురయ్యానని వెల్లడించి సంచలనం సృష్టించాడు. ఈ నిషేధం తర్వాత కోచింగ్‌పై దృష్టి పెట్టాలనుకున్న టేలర్‌ను జింబాబ్వే క్రికెట్ ఎండీ గివ్‌మోర్ మకోనీ ఒప్పించాడు. 2027 ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని తిరిగి జట్టులోకి రావాలని ప్రోత్సహించాడు. అతని మాటలతో స్ఫూర్తి పొందిన టేలర్, గతేడాది తిరిగి జాతీయ జట్టులోకి వచ్చి ఇప్పుడు సచిన్ రికార్డును బద్దలు కొట్టి తన పేరును క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్ లో చరిత్ర సృష్టించిన శ్రీచరణి.. 800 పాయింట్లను టచ్ చేసిన తొలి భారత బౌలర్

- ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చరిత్ర సృష్టించిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణి
- 800 రేటింగ్ పాయింట్లు దాటిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా రికార్డు
- మిథాలీ రాజ్ పేరిట ఉన్న 780 పాయింట్ల రికార్డును అధిగమించిన చరణి
- బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లిన దీప్తి శర్మ
- బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన షఫాలీ వర్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళా క్రికెట్‌లో యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీచరణి సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మైలురాయిని దాటిన తొలి భారత బౌలర్‌గా ఈ తెలుగమ్మాయి అరుదైన ఘనతను అందుకుంది. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఆమె 804 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఇప్పటివరకు ఏ భారత మహిళా క్రికెటర్ (బ్యాటింగ్ లేదా బౌలింగ్) కూడా ఈ ఘనతను సాధించలేదు. 2011లో భారత దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ నెలకొల్పిన 780 పాయింట్ల అత్యుత్తమ రేటింగ్‌ను శ్రీచరణి ఇప్పుడు అధిగమించింది. ఇటీవల ముగిసిన ఆసియా కప్ 2026 ఫైనల్‌లో శ్రీలంకపై శ్రీచరణి అద్భుత ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కేవలం 20 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. టోర్నీ మొత్తం మీద 12 వికెట్లతో సత్తా చాటింది. ఈ ప్రదర్శనతో ఆమె రేటింగ్ పాయింట్లు భారీగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల టీ20 క్రికెట్‌లో 800 పాయింట్ల మార్క్ దాటిన మూడో బౌలర్‌గా ఆమె నిలిచింది. గతంలో ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ (802), ఆస్ట్రేలియా పేసర్ మేగన్ షట్ (806) మాత్రమే ఈ ఘనత సాధించారు. ప్రస్తుతం మేగన్ షట్ పేరిట ఉన్న ఆల్‌-టైమ్ రికార్డుకు శ్రీచరణి కేవలం రెండు పాయింట్ల దూరంలో ఉంది. అంతేకాకుండా, ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా పూనమ్ యాదవ్ రికార్డును కూడా చరణి ఈ ఏడాది అధిగమించడం విశేషం. మరోవైపు, భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. ఆసియా కప్‌లో 14 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన దీప్తి, ఫైనల్‌లో 19 పరుగులకు 3 వికెట్లు తీసింది. ఈ ప్రదర్శనతో ఆమె నాలుగు స్థానాలు ఎగబాకి 729 పాయింట్లతో బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆసియా కప్ గెలవడంతో ఇతర క్రీడాకారిణుల ర్యాంకులు కూడా మెరుగయ్యాయి. ఫైనల్‌లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ (68) ఆడిన ఓపెనర్ షఫాలీ వర్మ, బ్యాటర్ల జాబితాలో ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ ఐదు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచింది.

# చెన్నై సూపర్ కింగ్స్ లో ధోనీ కొత్త అవతారం.. ఆటగాడిగా కాదు, కోచ్‌గా ఎంట్రీ? మాజీ సెలెక్టర్ బిగ్ కామెంట్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) హెడ్ కోచ్ పదవి నుంచి స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్న తర్వాత, తదుపరి కోచ్ ఎవరనే దానిపై ఊహాగానాలు తారస్థాయికి చేరాయి. ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన సీఎస్కే కోచ్ రేసులో మాజీ క్రికెటర్ హేమాంగ్ బదానీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా, భారత మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. సీఎస్కే లాంటి దిగ్గజ ఫ్రాంచైజీకి బదానీ కోచ్‌గా వ్యవహరించే అర్హత లేదని తెగేసి చెప్పాడు.

**ధోనీ ఉన్న చోట వేరే కోచ్ దేనికి:**
తన యూట్యూబ్ ఛానెల్‌లో శ్రీకాంత్ మాట్లాడుతూ.. హేమాంగ్ బదానీ సీఎస్కే హెడ్ కోచ్ అవ్వడానికి ఏమాత్రం వీల్లేదు. ఢిల్లీ క్యాపిటల్స్ (ణజ)లో అతను సాధించింది ఏమీ లేదు.. అతని కోసం సీఎస్కే ఎందుకు ఎగబడాలో నాకైతే అర్థం కావడం లేదు.. అసలు ఎంఎస్ ధోనీ జట్టులో ఉన్నప్పుడు వేరే కోచ్ అవసరం ఏముంది? ధోనీ ఒక్కడే హెడ్ కోచ్ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించగలడు అని సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**ఇండియన్ కోచ్ కావాలంటే పండిత్ బెస్ట్:**
ఒకవేళ మహేంద్ర సింగ్ ధోనీ కచ్చితంగా భారతీయ కోచ్‌నే కోరుకుంటే, కేకేఆర్ మాజీ కోచ్ చంద్రకాంత్ పండిత్‌ను ఎంపిక చేసుకోవాలని శ్రీకాంత్ సూచించాడు. రంజీ, ఐపీఎల్ స్థాయిలో ట్రోఫీలు గెలిచిన అపార అనుభవం పండిత్‌కు ఉందన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ప్లేయర్ అయినవారికి లేదా డొమెస్టిక్, ఐపీఎల్‌లో అద్భుత రికార్డు ఉన్న కోచ్‌లకే సీఎస్కే బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశాడు.

**తొందరపాటు వద్దు.. డిసెంబర్‌లో ఆక్షన్:**
డిసెంబర్‌లో మాత్రమే ఐపీఎల్ ఆక్షన్ జరగనుంది, కాబట్టి కొత్త కోచ్ ఎంపిక విషయంలో చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తొందరపడాల్సిన అవసరం లేదని మాజీ చీఫ్ సెలెక్టర్ శ్రీకాంత్ సలహా ఇచ్చాడు. ప్రశాంతంగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. మరోవైపు డీసీ యాజమాన్యం జెఎస్‌డబ్ల్యూ హస్తగతమవుతుండటంతో సౌరవ్ గంగూలీ హెడ్ కోచ్‌గా, యువరాజ్ సింగ్ అసిస్టెంట్ కోచ్‌గా డీసీ బాధ్యతలు స్వీకరించడం దాదాపు ఖాయమైంది.

# పరిశ్రమను వెంటాడుతున్న పార్ట్-2 ఫ్లాప్ సెంటిమెంట్!





ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమను విచిత్రమైన భయం వెంటాడుతోంది. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన బ్లాక్‌బస్టర్ సినిమాలకు సీక్వెల్స్ (పార్ట్-2) తెరకెక్కించడం అక్కడ ఓ ట్రెండ్‌గా మారినా? ఆ సీక్వెల్స్ సాధిస్తున్న ఫలితాలు మాత్రం మేకర్స్‌ను భయాందోళనకు గురిచేస్తున్నాయి. భారీ అంచనాల మధ్య వచ్చిన పార్ట్2 చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడటంతో పరిశ్రమలో సీక్వెల్స్ ఫ్లాప్ సెంటిమెంట్ ఓ పెద్ద గండంలా తయారైంది. గతంలో వచ్చిన చిత్రాల ఘనవిజయాన్ని ఆధారంగా చేసుకుని తీసిన అనేక పార్ట్-2 సినిమాలు ప్రేక్షకులను తీవ్రంగా నిరాశపరిచాయి. శంకర్-కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వచ్చిన -ఇండియన్ 2- బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. పి. వాసు-రాఘవ లారెన్స్ కాంబినేషన్ లో రిలీజ్ అయిన -చంద్రముఖి 2-, విక్రమ్ -సామి 2-, విశాల్ -పందెంకోడి 2- వంటి చిత్రాల ఫలితాలు తారుమారయ్యాయి. తాజాగా రిలీజ్ అయిన సర్దార్ 2 కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. మొదటి భాగాలు సాధించిన విజయంలో సగం కూడా సాధించలేక డిజాస్టర్లుగా ముగిసాయి. సీక్వెల్స్ వరుసగా పరాజయం పాలవ్వడానికి ప్రధాన కారణం మొదటి భాగం పెంచిన అంచనాలే అని విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి భాగంలో ఉన్న కథా బలం, భావోద్వేగాలు , వినోదం సీక్వెల్స్‌లో లోపించడమే ఫ్లాప్‌లకు కారణం. కేవలం బ్రాండ్ నేమ్‌ను, క్రేజ్‌ను మాత్రమే నమ్ముకుని స్క్రిప్ట్‌పై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ప్రేక్షకులు ఈ చిత్రాలను నిర్దాక్షిణ్యంగా తిరస్కారించనే మాట బలంగా వినిపిస్తోంది. దీంతో నిర్మాతలు వందల కోట్ల నష్టపోయారు . ఈ ప్రతికూల పరిస్థితులు పార్ట్-2 ఫ్లాప్ సెంటిమెంట్ నడుమ తాజాగా కోలీవుడ్ అభిమానుల ఆశలన్నీ రాబోయే కొన్ని క్రేజీ సీక్వెల్స్‌పైనే నెలకొన్నాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ - నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో తెరకెక్కుతోన్న -జైలర్ 2-, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో కార్తి హీరోగా తెరకెక్కనున్న -ఖైదీ 2-, లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (రాజఖ)లో భాగంగా రానున్న కమల్ హాసన్ -విక్రమ్ 2- చిత్రాలపై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రాలు ఆ దర్శక, హీరోల ప్రతిష్టకే కాకుండా కోలీవుడ్‌లో సీక్వెల్స్‌పై పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కీలకంగా మారాయి. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ వంటి ప్రతిభావంతులైన దర్శకులు తెరకెక్కించే -ఖైదీ 2-, -విక్రమ్ 2- చిత్రాలు కంటెంట్ పరంగా పక్కాగా ఉంటాయని.. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తాయని సినీ ప్రియులు బలంగా నమ్ముతున్నారు. ఏదేమైనా సీక్వెల్ తీయడం అనేది కత్తిమీద సాము లాంటిదని తమిళ పరిశ్రమ మరోసారి గ్రహించింది. ఈ ఫ్లాప్ సెంటిమెంట్‌ను చెరిపివేసి రాబోయే చిత్రాలు కోలీవుడ్ బాక్సాఫీస్‌కు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా? లేదా? అన్నది చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com